ప్రజాశక్తి

శనివారం 15 ఫిబ్రవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఫార్మా కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి



ఫార్మా వ్యర్థాలతో నిండిన మొల్లోడు గెడ్డ

- నిబంధనలకు నీళ్లొదలిన కంపెనీలు
- పర్యావరణానికి పాతర
- అనారోగ్యాలబారిన గ్రామీణులు
- చోద్యం చూస్తున్న కాలుష్య నియంత్రణ మండలి

ప్రజాశక్తి - పరవాడ

రాంకీ ఫార్మా సిటీలోని కంపెనీల కాలుష్యకాటుతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రసాయన వ్యర్థాలు భూమిలోకి జొరబడి తాగునీటిని విషతుల్యంగా మారుస్తుండటంతో వారంతా ఆర్తనాదాలు చేస్తున్నారు. ఫార్మా కంపెనీల సమీప పల్లెలు కాలుష్య కోరల్లో చిక్కుకొని అల్లాడుతుంటే అధికారులు, పాలకులు చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ఫార్మా కంపెనీల కాలుష్యానికి పరవాడ మండలంలోని మొల్లోడు గెడ్డ, పలు చెరువులు, కాలువలు ప్రత్యక్ష తార్కాణాలు. చాలా గ్రామాల్లో ఎక్కడికక్కడ ఫార్మా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. కంపెనీల సమీపంలోని గ్రామాల ప్రజలు జల, వాయు కాలుష్యం బారిన పడుతున్నారు. కీళ్లనొప్పులు, శ్వాసకోశ. మూత్ర పిండాల వ్యాధులు, కేన్సర్ సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ఈ ప్రాంతంలోని భూములు ఏ పంటకూ పనికి రాకుండా పోతున్నాయి. ఫార్మా కంపెనీలు శుద్ధి చేయకుండా వ్యర్థ జలాలను, వ్యర్థాలను కాలువలు ద్వారా భూమిలోకి వదలడంతో భూగర్భజలాలు విషతుల్యంగా మారి పోతున్నాయి. బోర్ల నుంచి వస్తున్న నీరు పూర్తిగా రసాయనాలతో నిండి ఉంటోంది. నీటిలో ఒక్కొక్కసారి నురగ, తెట్టు కనిపిస్తున్నాయి. వరి వేస్తే దిగుబడులు రావడం లేదని, కూరగాయలు పండిస్తే కాపురావడం లేదని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదముషిడివాడ చెరువులోకి ఇటీవల ఫార్మా కంపెనీలు వ్యర్థ రసాయనాలను వదిలిపెట్టాయి. దీంతో మత్స్య సంపద దెబ్బతింది. కొద్ది నెలల క్రితం ముత్యాలమ్మపాలెం మిగతా 2లో..

వ్యవసాయానికి ముప్పు



పూర్వం నుంచీ మాకు వ్యవసాయమే ఆధారం. ఫార్మా వ్యర్థ జలాలతో మా భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోయాయి. వరి వేస్తే దిగుబడి రావడం లేదు. కూరగాయలు పండటం లేదు. పశువులు కూడా అనారోగ్యాల బారిన పడుతున్నాయి. ఫార్మా వ్యర్థ జలాల దుర్వాసనను భరించలేకపోతున్నాం. మా గ్రామాన్ని వేరొక చోటుకు తరలించాలి.

మాసారపు మహాలక్ష్మి, తానాం గ్రామం



విశాఖలో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ, ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగులు

బీమా రంగంలో..

100 శాతం విదేశీ పెట్టుబడిపై నిరసనలు

బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడిని వ్యతిరేకిస్తూ శుక్రవారం విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల్లో ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగులు నిరసనలు తెలిపారు. ప్రభుత్వ చర్యను ఖండిస్తూ పెద్దపెట్టున నినదించారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇన్సూరెన్స్ రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడికి అనుమతి ఇవ్వడం మంచిది కాదని, దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆర్థిక ప్రగతికి ప్రమాదకరమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. విశాఖలోని ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం వద్ద ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఐసిఆర్ఇఎ) ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్ఐసి పెన్షనర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడికి అవకాశమిస్తే కంపెనీపై విదేశీ భాగస్వామికి పూర్తి స్వేచ్ఛ, అదుపు ఉంటాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాల అమలుకు దేశీయ పొదుపు చాలా కీలకమనే విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇన్సూరెన్స్ కంపెనీల్లోని విదేశీ భాగస్వాములు తమ షేర్లను ఉపసంహరించి, లాభం వచ్చే చోటుకు బదిలీ చేసే అవకాశం ఉందని, అలా చేస్తే ఆయా ఇన్సూరెన్స్ కంపెనీలతో పాటు పట్టాదారులు కూడా మిగతా 2లో..

అదాని గంగవరం పోర్టును నోటిఫైడ్ ఏరియాగా ప్రకటించడం తగదు

▶ వార్త మెయిన్‌లో..

ధన్యజీవి సత్యానందరావు

▶ వార్త 2లో..

భర్త వికృత చేష్టలు తాళలేక వివాహిత ఆత్మహత్య

▶ వార్త 3లో..



యలమంచిలిలోని పాఠశాలలో ప్రచారం చేపడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి విస్తృత ప్రచారం

వార్త 5వ పేజీలో..

సామాన్యులకు బ్యాంకర్లు సహకరించాలి

కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సామాన్యులు, రైతుల ఆర్థిక అభ్యున్నతికి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని, రుణ మంజూరు ప్రక్రియలో సరళతర విధానాలు పాటించాలని బ్యాంకర్లను ఉద్దేశించి విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. జిల్లాలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే రుణాలను సకాలంలో రెన్యువల్ చేయాలని, రైతులకు, ఎంఎస్ఎంఇ ఔత్సాహికులకు అండగా నిలవాలని సూచించారు. దరఖాస్తుదారుకు వీలైనంత త్వరగా సమాధానం చెప్పాలని, పదేపదే బ్యాంకుల చుట్టూ తిప్పించుకోరాదని హితవు పలికారు. ఏదైనా సందర్భంలో దరఖాస్తును తిరస్కరిస్తే దానికి గల కారణాలను దరఖాస్తుదారుకు వివరించాలని సూచించారు. వ్యవసాయ, విద్యా సంబంధిత రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. పారిశ్రామిక ఔత్సాహికులకు, స్వయం ఉపాధి పొందే వారికి అన్ని విధాలుగా తోడ్పాటు అందించాలని సూచించారు. సమావేశంలో భాగంగా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల గురించి సమీక్షించారు. లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. నాబార్డు ద్వారా అందే ఆర్థిక సాయం, అమలయ్యే ప్రాజెక్టులు, గృహ రుణాల మంజూరు, బ్యాంకు లింకేజీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్‌బిఐ ప్రతినిధులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల అధికారులు, డిఆర్‌డిఎ, యుసిడి పీడీలు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

బీమా రంగంలో..
100 శాతం విదేశీ పెట్టుబడిపై నిరసనలు



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగులు

తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తపరిచారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.మోహన్‌రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్ఐసి పెన్షనర్లు అందరూ బీమా రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడిని వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఈ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి, పార్లమెంటుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బిబి.గణేష్, ఎన్ఆర్.ఠాగూర్, ఎ.తిరుమలరావు, బిటి.ప్రసాద్, ఎఎస్.రవిశేఖర్ పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు, ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ కన్వీనర్ పిఎస్.సుబ్బారావు మాట్లాడుతూ బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడి పెంపు ప్రతిపాదన స్వదేశీ పొదుపు మొత్తాలపై అధిక నియంత్రణకు దారితీస్తుందని అన్నారు. విదేశీ మూలధనం ఎల్లప్పుడూ ఎక్కువ లాభాలను వెతుక్కుంటూ వస్తుందన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. తాజా ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే భవిష్యత్తులో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మళ్ల చంద్రశేఖర్, వివిఎన్‌కె.హరినాథ్, జగదేశ్వరరావు, జంపా రమేష్ పాల్గొన్నారు.

ఫార్మా కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

ఉప్పు టేరులో చేపలు మత్స్యువాత పడ్డాయి. ఫార్మా కంపెనీల తీరు వల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫార్మా పరిశ్రమల ప్రభావం మూగ జీవాలనూ వెంటాడుతోంది. భూగర్భజలాల వల్ల పండిన గడ్డిని తినడం వల్ల ఆవులు, గేదెల్లో వ్యాధులు సంక్రమిస్తున్నాయి. గర్భం-చూడి నిలవడం లేదు. దీంతో మూగజీవాలను సాకడం భారంగా మారి రైతులు వాటిని కబేళాలలకు అమ్మేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతంలో ప్రజల మనుగడకు ముప్పు ఏర్పడుతోందని కార్మిక సంఘాల నాయకులు ఇటీవలే జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీరు కలుషితమవుతోంది



మా గ్రామానికి ఆనుకుని ఫార్మా కంపెనీలు ఉన్నాయి. వాటి తీరుతో తాగునీరు కలుషితమవుతోంది. 20 లీటర్ల క్యాన్‌ను రూ.20 ఇచ్చి కొనుక్కుని తాగుతున్నాం. తాగునీటి కోసం ప్రతి కుటుంబం రోజుకు రూ.80 వెచ్చించాల్సి వస్తోంది. రాంకీ వారు రోజుకు ఒక కుటుంబానికి ఒక లీటర్ మాత్రమే ఇస్తున్నారు. మా గ్రామాన్ని వేరొక చోటుకు తరలిస్తామని ఈ ప్రాంత నాయకులు అనేకమార్లు చెబుతూ వచ్చారు. అది జరగలేదు. నీటి కలుషితం వల్ల వ్యాధుల బారిన పడుతున్నాం.

కందిపల్లి పెంటయ్య, తాడి గ్రామం

వ్యాధుల బారిన పడుతున్నాం



మా గ్రామాన్ని ఆనుకుని ఉన్న మొల్లోడు గెడ్డలోకి ఫార్మా వ్యర్థాలు చేరుతున్నాయి. మా భూభాగమంతా కలుషితమవుతోంది. ఇటీవలే మా గ్రామంలోని బోరు బావుల వద్ద నీరు తాగిన వారంతా డయేరియా బారిన పడ్డారు. మా ప్రాంతంలో ఉన్న చెరువుల్లో చేపలు అనేకసార్లు మృత్యువాత పడ్డాయి. రైతులు తీవ్ర నష్టాలపాలయ్యారు.

జెర్రిపోతుల చంద్రరావు, భరణికం గ్రామం

రెవెన్యూ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 రెవెన్యూ డైరీని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జెసి కె.మయూర్ అశోక్ శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, ఆర్‌డిఒ పి.శ్రీలేఖ, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు త్రినాధరావు, రమేష్, డి.రాజేందరవర్మ, పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన నాగాలాండ్ విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అధ్యయన యాత్రలో భాగంగా నాగాలాండ్ విశ్వవిద్యాలయం, కోహినూర్ క్యాంపస్ వాణిజ్య విభాగం విద్యార్థులు శుక్రవారం విశాఖ పోర్ట్ అథారిటీని సందర్శించారు. వారికి పోర్ట్ కార్యదర్శి టి.వేణు గోపాల్, అధికారులు సాదర స్వాగతం పలికారు. పోర్ట్‌లో ఉన్న ఆర్థిక అవకాశాలు, దిగుమతి-ఎగుమతి సౌకర్యాలు, పోర్ట్ నిర్వహణా విధానాలను విద్యార్థులకు అధికారులు వివరించారు.

ధన్యజీవి సత్యానందరావు

- సంతాప సభలో వక్తలు


సత్యానందరావు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మిక హక్కుల సాధన, ప్రజా సమస్యల పరిష్కారంలో విశేషంగా కృషి చేసిన సిహెచ్.సత్యానందరావు ధన్యజీవి అని పలువురు వక్తలు కొనియాడారు. పోతిన మల్లయ్యపాలెం ఎంవివి ఎంక్లేవ్‌లో నివాసముంటున్న సిపిఎం పూర్వ జిల్లా కమిటీ సభ్యులు సత్యానందరావు ఈ నెల 5న తీవ్ర అనారోగ్యానికి గురై నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర, జిల్లా, మధురవాడ జోన్ నాయకులు, షిప్‌యార్డు నాయకులు, కాలనీ సహచరులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సత్యానందరావు నివాసం వద్ద సంతాప సభ జరిగింది. ఆ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీనియర్ నాయకులు ఆర్.బాబూరావు, కె.సుధాకర్ మాట్లాడుతూ సత్యానందరావు హిందుస్థాన్ షిప్ యార్డ్‌లో ఉద్యోగం చేస్తూ సిఐటియు నాయకునిగా పోరాటాలు నడిపారన్నారు. సంస్థ ఉద్యోగుల హక్కుల సాధనతో పాటు మల్కాపురం జోన్ పరిధిలో పలు పరిశ్రమల కార్మికులకు నాయకత్వం వహించారన్నారు. అమానుష దోపిడీకి గురవుతున్న ఆంధ్ర స్టీల్ కార్పొరేషన్‌లో సిఐటియు సంఘాన్ని స్థాపించి, యాజమాన్య భయానక చర్యలను ధైర్యంగా ఎదిరించి, కార్మిక చట్టాలను అమలు చేయడంలో సత్యానందరావు కృషి అమోఘమన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కమిటీ సభ్యునిగా జిల్లాలో పలు కార్మిక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. తన మరణం అనంతరం పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల పరీక్షల నిమిత్తం అందించాలని కోరిన సత్యానందరావు అందరికీ ఆదర్శ ప్రాయుడని కొనియాడారు.

జాతర వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎస్ఎస్ఎస్.రామచంద్రరాజు, ఎంవివి ఎంక్లేవ్ కార్యదర్శి సిహెచ్.అరుణసాగర్, ఎం.నర్సింగరావు, ఆప్రా జిల్లా కన్వీనర్ రాంప్రభు మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్, అపార్ట్మెంట్ అసోసియేషన్‌లో సత్యానందరావు చేసిన కృషిని, ఆయన ఔన్నత్యాన్ని కొనియాడారు. సంతాప సభలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, సీనియర్ నాయకులు వివిఎస్.పద్మనాభరాజు, నాయకులు డి.అప్పలరాజు, మల్కాపురం జోన్ నాయకులు కె.పెంటారావు, ఎ.సత్యారావు, ఎన్.కృష్ణమూర్తి, షిప్‌యార్డ్ సిఐటియు నాయకులు వై.అప్పారావు, ఆర్.శేషగిరిరావు, ఎస్.రామకృష్ణ, వరలక్ష్మి తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. సంతాప సభ, అంతిమ యాత్ర, శ్రద్ధాంజలి కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, అపార్ట్మెంట్ల వాసులు, మిథిలాపురి, బింద్రానగర్ కాలనీ వాసులు, షిప్‌యార్డ్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


సత్యానందరావు పార్థివ దేహం వద్ద నివాళి అర్పిస్తున్న జగ్గునాయుడు తదితరులు

కెజిహెచ్ అనాటమీ విభాగానికి పార్థివదేహం

సత్యానందరావు పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం కెజిహెచ్ అనాటమీ విభాగానికి కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా అనాటమీ విభాగ అధికారులు, వైద్యులు సత్యానందరావు త్యాగాన్ని ప్రశంసించారు. కుటుంబ సభ్యులను అభినందించారు. వారిని ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రశంసాపత్రం అందించారు.

చిరు వ్యాపారుల సమస్యలపై ఆరా


ఎమ్మెల్యేకు సమస్యలను తెలియజేస్తున్న చిరు వ్యాపారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పూర్ణా మార్కెట్ చిరు వ్యాపారుల సమస్యలపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరా తీశారు. శుక్రవారం పూర్ణా మార్కెట్ నుంచి రామకృష్ణ జంక్షన్ వరకు పాదయాత్రగా వెళ్లి వ్యాపారస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జరుగుతున్న పరిణామాలపై వారితో చర్చించారు. ప్రభుత్వ అధికారులు సమూలంగా దుకాణాలను ఖాళీ చేయడం పట్ల సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ సిబ్బంది చేపట్టిన చర్యలు పట్ల ఎమ్మెల్యే వివరణ కోరారు. అధిక ఆశీలు వసూళ్లు, పలువురు గుత్తాధిపత్యం చేస్తున్న అంశాలు ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకెళ్లారు. కొంతమంది చేతుల్లో అనేక షాపులు కేంద్రీకృతం కావడం వంటి అనేక అంశాలను స్థానిక వర్తకులు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

బుక్ ఏ ఛేంజ్‌తో సరికొత్త అధ్యాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తాము ప్రారంభించిన 'బుక్ ఏ ఛేంజ్' ప్రోగ్రాం ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని ఆ సంస్థ హెడ్ ఫర్జానా కామా బాల్పండే మీడియాకు తెలిపారు. విశాఖలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ కళల ద్వారా మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో బుక్ ఏ ఛేంజ్‌ను తీసుకొచ్చామని వెల్లడించారు. సంగీత ప్రదర్శన, కళల ప్రాముఖ్యతను అందరికీ అందుబాటులో తీసుకురావాలని, అట్టడుగున ఉన్న వ్యక్తులు, సమూహాలకు సాధికారత కల్పించాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.

150 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస :స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 150 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్త దానం చేశారు. నగరంలోని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ బ్లడ్‌బ్యాంక్ సౌజన్యంతో విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ పిఒ షరీఫ్, అధ్యాపకులు పాల్గొన్నారు

డాక్టరేట్ అందుకున్న రాముకు అభినందన


రామును అభినందిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- తగరపువలస : ఆంధ్రా యూనివర్సిటీ మెరైన్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ అందుకున్న స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు జి రామును శుక్రవారం విద్యాసంస్థల అధినేత, మాజీమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభినందించారు. ఎయు ఆచార్యులు వివిఎస్ ప్రసాద్ పర్యవేక్షణలో 'డీజిల్ ఇంజన్ సామర్థ్యం పెంపు' అంశంపై పరిశోధన చేసి సమర్పించిన థీసెస్‌కు రాముకు మెరైన్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ లభించింది. ఎయులో రిజిస్ట్రార్ నుంచి డాక్టరేట్ స్వీకరించిన రామును అవంతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి మురళీకృష్ణ డైరెక్టర్ ఆకుల

మొక్కలు నాటడంపై అవగాహన

ప్రజాశక్తి -ములగాడ : మొక్కలునాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు మానవాళితోపాటు జీవరాశులన్నింటికీ అవసరమైన ఆక్సిజన్ సమృద్ధిగా అందుతుందని రామచంద్ర బౌద్ధారామం బౌద్ధసన్యాసి స్వామి దేవానంద అన్నారు. శుక్రవారం శ్రీహరిపురంలోని స్వామి వివేకానంద హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మొక్కలు నాటి సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మురళి, కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు,

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజాసమస్యల పరిష్కారంతోపాటు పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని జనసేన నగర అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ ఆధ్వర్యంలో సీతంపేటలోని పార్టీ కార్యాలయంలో వార్డు అధ్యక్షులు, ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.కార్యక్రమంలో ఉత్తర కార్పొరేటర్లు ఉష శ్రీ, కంటిపాము పరమేశ్వరి పాల్గొన్నారు,

అధునాతన సాంకేతికతపై వర్క్‌షాప్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అత్యాధునిక సాంకేతికతలపై శిక్షణనిచ్చారు. భువనేశ్వర్‌లోని సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (సిటిటిసి) సహకారంతో ఇసిఇ, ఇఇఇ, మెకానికల్ , సివిల్ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులకు వారి కెరీర్ అభివృద్ధికి అవసరమైన అత్యున్నతమైన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. సిటిటిసి నిపుణులు ఇండస్ట్రీ 4.0, ఆటోమేషన్, లాట్, రాపిడ్ మాన్యు ఫాక్చరింగ్, 3డి ప్రింటింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఆర్ఐటి చీఫ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ పిఎస్.రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శంభుప్రసాద్, ఐఐఇ లీడ్ డాక్టర్. పిఎన్ఇ. నవీన్, కోలీడ్ పి.కావ్య స్టూడెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

భర్త వికృత చేష్టలు తాళలేక

వివాహిత ఆత్మహత్య

గోపాలపట్నం నందమూరినగర్‌లో ఘటన


మృతురాలు వసంత (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని నందమూరి నగర్‌లో గురువారం రాత్రి వివాహిత ఆత్మహత్య ఘటన స్థానికంగా కలకలం రేపింది. శుక్రవారం కెజిహెచ్ వద్ద మృతురాలి బంధువులతోపాటు గోపాలపట్నం సిఐ జి.అప్పారావు తెలిపిన వివరాలివి.

నందమూరినగర్‌కు చెందిన చిక్కాల నాగేంద్రబాబుకు గాజువాక ప్రాంతానికి చెందిన ఏడువాక వసంత (24)తో 11నెలల క్రితం వివాహమైంది. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న నాగేంద్రబాబు పెళ్లయిన నాటి నుంచి భార్య వసంతను లైంగికంగా అనేక వేధింపులకు గురిచేసేవాడు. భర్త వికృతచేష్టలు, లైంగిక వేధింపులు భరించలేని వసంత తన తల్లిదండ్రుల వద్ద గోడును వెల్లబోసుకునేది. గురువారం రాత్రి కూడా అదేమాదిరిగా సెక్సువల్ వేధింపులకు గురిచేయడంతో తన బావకు విషయాన్ని వాట్సాప్‌లో మెసేజ్ పెట్టిందని మృతురాలి బంధువులు అంటున్నారు. ఎప్పటికీ భర్త తీరులో మార్పు రాకపోవడంతో మానసిన వేదనకు గురైన వసంత గురువారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు ఒడిగట్టిందని మృతురాలి బంధువులు తెలిపారు. స్థానికులు ఆమెను ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించినప్పటికీ అప్పటికే మృత్యువాత పడిందని వైద్యులు ధ్రువీకరించారు.

దీనిపై సిఐ అప్పారావు మాట్లాడుతూ, గురువారం రాత్రి 100కు ఫోను కాల్ రావడంతో వెంటనే అప్రమత్తమై నందమూరినగర్‌కు వెళ్లామన్నారు. మృతురాలి తల్లిదండ్రులు సన్యాసమ్మ, వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, వసంత బలవన్మరణం ఘటన ప్రత్యేక కేసుగా పరిగణించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలి బంధువులిచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, నాగేంద్రబాబును అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని నుంచి ఫోను, ట్యాబ్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెల్లడించారు.

వచ్చేనెల 28న జర్నలిస్టుల ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - సీతమ్మధార : జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఏటా మాదిరిగానే వచ్చేనెల 28న ఉగాది సంబరాలు నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తెలిపారు..శుక్రవారం అక్కయ్యపాలెం జంక్షన్‌లోని ప్రైవేట్ హోటల్‌లో ఏపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ విశాఖ యూనిట్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ ఆ రోజున అల్లూరి విజ్ఞాన కేంద్రంలోకవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం, లక్కీ డీప్, వంటికార్యక్రమాలు ఉంటాయన్నారు.

జర్నలిస్టులకు ఇంటిస్థలాలు, ఇళ్లు వంటి హామీల అమలుకు ఈనెల 24నుంచి జరగనున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని రాష్ట్ర కార్యవర్గం ద్వారా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్, మంత్రి లోకేష్‌లకు వినతులు అందజేసామన్నారు, ఎపిడబ్ల్యుజెఎఫ్ అర్బన్ అధ్యక్షులు. పి నారాయణ కార్యదర్శి జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటివరకు 650 సభ్యత్వాలు నమోదయ్యాయన్నారు. త్వరలో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో సభ్యత్వ నమోదు చేపట్టి, యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ ప్రతినిధులు డి.రవికుమార్, ఎసాంబ శివరావు, ఇ.ఈశ్వరరావు, కె.మదన్, జగన్మోహన్, కొచ్చెర్ల శ్రీనివాస్, జి.రాంబాబు, ఆనంద్, రంగధామం, సీతారామ్మూర్తి, రాజశేఖర్, నాయుడు గణపతి, బి.ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు

పేపర్ మోడలింగ్‌పై 'గీతం'లో వర్క్‌షాప్


వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ: పాఠశాల స్థాయి విద్యార్థులలో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి, ఆర్కిటెక్చర్ పట్ల అవగాహన పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో శుక్రవారం పేపర్ మోడలింగ్‌పై ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ప్రముఖ ప్యాకేజింగ్ డిజైన్ నిపుణుడు, జాతీయస్థాయి సంస్థలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించిన అనుభవం గల అరుణ్‌దేశాయ్ పాల్గొని, విద్యార్థులకు పేపర్ మోడలింగ్‌పై అవగాహన కల్పించారు. పేపర్ ఉపయోగించి వివిధ రకాల ఆకృతులు, నిర్మాణాలను రూపొందించడంపై విద్యార్థులతో ఆసక్తి కలిగించేలా పేపర్ మోడలింగ్‌లను తయారు చేయించారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ ప్రొఫెసర్ విభూతి సత్యదేవ్, నౌసేనాబాగ్ కేంద్రీయ విద్యాలయతోపాటు పొలాక్స్, ఇంటెల్లి తదితర పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

శతశాతం వయోజన విద్య 'ఉల్లాస్' లక్ష్యం



మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి

ప్రజాశక్తి-పద్మనాభం: శతశాతం వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యమని డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయ సమావేశమందిరంలో ఉల్లాస్ వాలంటీర్లకు 'అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ ద సొసైటీ 'శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి లక్ష్మీపతి మాట్లాడుతూ, జాతీయ విద్యావిధానం 2020లో భాగంగా స్వయంసహాయక సంఘాలలోని సభ్యులకు ప్రాథమికవిద్య, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహనకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించి అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.విజయ్ కుమార్, వెలుగు ఎపిఎం సాయిరమేష్, వయోజన విద్య వాలంటీర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

- మరో యువకునికి గాయాలు

ప్రజాశక్తి -గాజువాక : టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందగా, మరో యువకుడికి తీవ్రగాయాలైన ఘటన గాజువాక సిఎంఆర్ జంక్షన్ వద్ద శుక్రవారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలివి. నగరంలోని సీతమ్మధారకు చెందిన చెందిన ఎం.లక్ష్మణరావు (50) అదే ప్రాంతానికి చెందిన జి రమణ ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై అనకాపల్లి నుండి సీతమ్మధార వస్తుండగా, మార్గమధ్యలో సిఎంఆర్ సెంట్రల్ వద్ద ముందు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనక నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు సంఘటనాస్థలిలో దుర్మరణం చెందగా, రమణ కాలుకు తీవ్ర గాయమైంది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఎం.సత్యనారాయణను అదుపులోకి తీసుకొని, ఆయన వద్ద నుండి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపారు. తాళ్లపాలెం గ్రామంలో సత్యనారాయణ వద్ద ఉన్న తెల్లని గోనె సంచి మూటను గురువారం రాత్రి తెరిచి పరిశీలించగా అందులో 10 మద్యం బాటిళ్లు ఉన్నాయి. నిందితుడిని అదుపులోని తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

విశాలాక్షినగర్‌లో డ్రగ్స్ కలకలం

-పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రగ్స్ కలకలం రేగింది. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివి. ఒడిశాకు కు చెందిన షేక్ ముధఫర్, మహమ్మద్ చాంద్‌భాషా, షేక్ అనీష్ అనే ముగ్గురు వ్యక్తులు విశాలాక్షి నగర్ సమీపంలో డ్రగ్ అముతున్నట్లు సమాచారం రావడంతో విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. రెండు గ్రాముల బ్రౌన్‌సుగర్ స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. ఈ డ్రగ్‌ను ఒడిశాలోని అరబ్ అనే వ్యక్తి నుండి కొనుగోలు చేసినట్లు నిందితులు తెలిపారన్నారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టిడ్కో కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ పరిధిలోని పెదగంట్యాడ, భానోజీ తోటలోని టిడ్కో గృహసముదాయాల్లో మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ నేతలు కోరారు. శుక్రవారం జివిఎంసి గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ గాజువాక కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ టిడ్కో నివాసితులు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.. విద్యుత్, తాగునీరు, డ్రైనేజి వ్యవస్థ, ఇతర సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. సిపిఐ నాయకులు జి.ఆనంద్ , అప్పారి విష్ణుమూర్తి, టిడ్కో నివాసితుల సంక్షేమ సంఘం నాయకులు అప్పలరాజు ఉన్నారు.

76 మందికి వైకల్య నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సదరం ధ్రువీకరణ పత్రాల పున:పరిశీలన కేంద్రంలో శుక్రవారం మండలంలోని తాటితూరు, తాళ్లవలస గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 76 మంది శారీరక వైకల్యం ఉన్న వారికి ప్రత్యేకంగా నియమించిన వైద్యులతో వైకల్య నిర్ధారణ పరీక్షలు చేశారు. వారి ధ్రువపత్రాలు పున:పరిశీలన చేశారు.ఎంపిడిఒ ఎన్ హనుమంతరావు, ఇఒపిఆర్‌డి కె రమేష్‌నాయుడు, కార్యాలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు


నిర్ధారణ పరీక్షలకు వచ్చిన వికలాంగులు

విద్యార్థినులకు క్రీడా కిట్లు పంపిణీ



మల్కాపురంలో క్రీడాకిట్లు పంపిణీ చేస్తున్న స్థానిక నేతలు, హెచ్‌ఎం

ప్రజాశక్తి- ములగాడ: నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్కాపురం జివిఎంసి ఉన్నతపాఠశాలోని 326 మంది విద్యార్థులకు శుక్రవారం స్థానిక నాయకులు, హెచ్‌ఎం ఎల్.అరుణకుమారి సమక్షంలో ఎస్‌ఎలు పావని, వెంకటలక్ష్మి స్పోర్ట్స్‌కిట్లను పంపిణీ చేశారు కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ మజ్జి సోమేష్ , తెలుగు మహిళ వార్డు అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, చంద్రమౌళి, శంకరమ్మ, పైడిరాజు, ఉపాధ్యాయులు, హెచ్‌పిసిఎల్ యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : నాంది ఫౌండేషన్, కెసి.మహేంద్ర ఎడ్యుకేషనల్ ఆధ్వర్యంలో 92వ వార్డు వెంకటాపురం జెడ్‌పిఉన్నత పాఠశాలలో వందమంది విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేశారు. హెచ్‌ఎం ఎ.అప్పారావు, పాఠశాల చైర్మన్ వై.సన్యాసిరావు, ఫౌండేషన్ పిఒ వై.సత్యవతి, మాధవి, స్వాతి పాల్గొన్నారు.

గీతం ఎన్‌సిసి కేడెట్ ప్రతిభ



రిపబ్లిక్‌డే పరేడ్‌లో సత్తాచాటిన వినీల్ దీక్షిత్

ప్రజాశక్తి -మధురవాడ : ఢిల్లీ గణతంత్ర పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ఎన్‌సిసి నేవీ యూనిట్‌కు ప్రాతనిధ్యం వహించి సత్తాచాటిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ బిసిఎ కోర్సు విదార్థి వినీల్ ధీక్షిత్‌ను శుక్రవారం కాలేజీలో అభినందించారు. జాతీయ స్థాయిలో 2500 మంది ఎన్‌సిసి కేడెట్‌లతో పోటీ పడి ప్రతిభ ఆధారంగా అగ్రనేతల ముందు ఢిల్లీ రిపబ్లిక్‌డే పరేడ్‌లో వినీల్‌దీక్షిత్ అత్యుత్తమ ప్రదర్శన చేశాడని గీతం క్రీడా విభాగం డైరెక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. పలు జాతీయ స్థాయి క్యాంప్‌లకు ఎంపికైన వినీల్ దీక్షిత్ ఎన్‌సిసి నౌకాదళ యూనిట్‌లో ఉత్తవ కేడెట్‌గా నిలిచాడని అభినందించారు.

విద్య, వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఒఎన్‌జి ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీలో ఒఎస్‌జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుల్వామా అమరజవాన్లకు నివాళిగా ఇద్దరికి విద్య వైద్యానికి ఆర్థికసాయం చేశారు. అయినాడ బోత్సపేటలో కరెంట్ షాక్‌తో కాలు కోల్పోయిన భవన నిర్మాణకార్మికుడి వైద్యానికి రూ.20వేలు, ఎయులో పిజి సెకెండియర్ చదువుతున్న అంధవిద్యార్థి రాకేష్‌కు యూనివర్సిటీ ఫీజు కోసం రూ.పది వేలు సాయాన్ని ఫౌండేషన్ ద్వారా అందించారు. సంస్థ వ్యవస్థాపకులు శివ దళాయి, మరుపిళ్ళ సాయి జ్ఞానేశ్వర్, రామిరెడ్డి శ్రీకాంత్ చందు పాల్గొన్నారు

పుల్వామా వీర జవాన్లకు నివాళి

ఆనందపురం : పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన 44 మంది సైనిక, సిఆర్‌పిఎఫ్ జవాన్లకు జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆనందపురం భారతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, కోశాధికారి కుప్ప రామలక్ష్మి సభ్యులు ముడసల వంశీ, పాఠశాల డైరెక్టర్ దొంతల రామారావు, ప్రిన్సిపల్ ఎద్దు కృష్ణ పిఈటి దిలీప్ , ఉపాధ్యాయులు రాంబాబు, రాజబాబు, శంకర్, పైడిరాజు, ఉమా, శిరీష, శ్రావణి, రామలక్ష్మి , ఝాన్సీలక్ష్మీబాయి,అఖిల ,హేమలత ,జమున, రామలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

గోస్తనీ గొంతు తడిపేనా?

- నదిలో గణనీయంగా తగ్గిన నీటిమట్టం
- సాధారణం (32 అడుగులు) కన్నా బాగా తక్కువగా (26.2 అడుగులు) నీటి నిల్వలు
- వేసవికి ముందుస్తుగా ప్రమాద హెచ్చరికలు
- అధికారులు, ప్రజల్లోనూ నెలకొన్న ఆందోళన



గోస్తనీలో గణనీయంగా తగ్గిన నీటి నిల్వలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి మండలం, జోన్‌కు ప్రధాన నీటివనరుగా ఉన్న గోస్తనీ నదిలో గణనీయంగా తగ్గిపోయిన నీటినిల్వలు వేసవికి ముందస్తుగానే ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. గోస్తనీలో సాదారణ నీటిమట్టం 32 అడుగులుకాగా, దీని పరిధిలోని ప్రజల రోజువారీ అవసరాలకుకనీసం 28 అడుగుల మేరకైనా నీరు ఉండాలి. కానీ ప్రస్తుతం గోస్తనీలో బాగా తక్కువగా 26.2 అడుగుల మేర నీటిమట్టం ఉండడంతో కలవరం మొదలైంది. వేసవిలో సరిపడా తాగునీరు అందుతుందో, లేదో అన్న ఆందోళన అటు అధికారుల్లోనూ, ఇటు ప్రజల్లోనూ నెలకొంది.

జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 1 నుంచి 4 వార్డుల్లో ప్రస్తుతం 76,613 మంది జనాభా ఉన్నారు. వీరి రోజువారీ తాగునీరు, ఇతర అవసరాలకు వాస్తవానికి 1.5 మిలియన్ గేలన్ల (ఎంజిడి) తాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా, ఇపుడు రోజుకు 1.3 ఎంజిడిల నీటిని మాత్రమే అందిస్తున్నారు. ఒక్కోమనిషికి రోజు అవసరాలకు సగటున 135 లీటర్స్ ఫర్ కేపిట ఫర్ డే (ఎల్‌పిడిసి) నీరు అవసరం.

అయితే 110 ఎల్‌పిసిడి నీటిని ఇస్తున్నారు. ఇపుడు గోస్తనీలో నీటి నిల్వలు తగ్గిపోతుండడంతో, ఇప్పటికే తగ్గించి ఇస్తున్న నీటిసరఫరా మరింత తగ్గకతప్పదనే ఆందోళన వ్యక్తమౌతోంది.

జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని నాలుగు వార్డుల్లో 7,318 ఇంటి కుళాయిలు, 1533 పబ్లిక్ కుళాయిలు, 761 చేతి పం.పులు ఉన్నాయి. వేంకటేశ్వర మెట్ట వద్ద 1800 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన గ్రౌండ్ లెవెల్ రిజర్వాయర్ , కొండపేటలో 680 కిలోలీటర్లు, భీమిలిలో 450 కిలోలీటర్లు, నమ్మివానిపేటలో 140కిలోలీటర్లు, కృష్ణాకాలనీలో 800 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు ఉన్నాయి. సామయ్యవలసలో ఆరు, టి నగరపాలెంలో నాలుగు ఊటబావులు ఉన్నాయి.

21.26 కిలోమీటర్ల పొడవు గల ప్రధాన పైప్‌లైన్, 92.227 కిలోమీటర్ల పొడవు గల తాగునీటి సరఫరా పైపులైన్లు, 3.10 కిలోమీటర్ల పొడవు గల గ్రేవిటీ ప్రధాన లైన్ ద్వారా రోజూ తాగునీరు సరఫరా అవుతుంది.

విడతల వారీ నీటి సరఫరా

1,2 వార్డులకు ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు, 3వ వార్డులో ఉదయం 5 గంటల నుంచి 10.15గంటల వరకు, 4వ వార్డులో విలీన పంచాయితీలైన జెవి అగ్రహారం, నిడిగట్టు, కాపులుప్పాడ, చేపలుప్పాడ, కె నగరపాలెం ప్రాంతాలకు ఉదయం 5గంటల నుంచి 10 గంటల వరకు విడతలవారీగా తాగు నీరు సరఫరా చేస్తున్నారు.

విలీన పంచాయతీల్లో ఉప్పు నీరే శరణ్యం

2013లో జివిఎంసిలో విలీనమైన నాలుగోవార్డు కె.నగరపాలెం, చేపలుప్పాడ, కాపులుప్పాడ, నిడిగట్టు, జెవి.అగ్రహారం పంచాయతీ గ్రామాల్లో 23,760 మంది జనాభా ఉన్నారు. సముద్రతీరాన ఆయా గ్రామాలు ఉండడంతో ఉప్పునీరే శరణ్యం. వీరికి రక్షితనీరు అందుబాటులో లేదు.10, 40, 60, 90 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన 8 జిఎల్‌ఎస్‌ఆర్‌లు, 20,40,50 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఇఎల్‌ఎస్‌ఆర్‌లు ఉన్నాయి. అయితే ఆయా రిజర్వాయర్లు, ట్యాంక్‌ల ద్వారా ఉప్పునీరు సరఫరా అవుతుంది.దీంతో ఆయాగ్రామాల ప్రజలు ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ల నుంచి ప్లాస్టిక్ క్యాన్ల ద్వారా తాగునీటి కొనుక్కోక తప్పడం లేదు. 2020 జనవరిలో వార్డుల విభజన జరిగి, ఐదేళు గడుస్తున్నా సరే, ఐదు విలీన పంచాయతీల్లోని గ్రామాల ప్రజలకు సురక్షిత తాగునీరు నేటికీ గగంగానే ఉండడం గమనార్హం.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు




వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ఇప్పటికే ముందస్తు చర్యలు తీసుకున్నాం. జివిఎంసి ఒకటో జోన్ ప్రజలకు గోస్తనీ, తాటిపూడి రిజర్వాయర్లు తాగునీటి అవసరాలు తీరుస్తుండగా, ప్రస్తుతం గోస్తనీ నీటిమట్టం గణనీయంగా తగ్గుతోంది. తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీటి విడుదలకు విజయనగరం జిల్లా కలెక్టర్‌ను ఇప్పటికే కోరాం. గోస్తనీలో చెక్‌డ్యాంలు నిర్మిస్తే, నీరు నిల్వ ఉండి తాగునీటి సమస్య తలెత్తదు. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. ఐదు విలీన గ్రామాలకు శాశ్వతంగా రక్షిత నీరు అందాలంటే, అది ఏలేరు కాలువ ద్వారా గోదావరి నీరు వస్తేనే సాధ్యం.

– జి సురేష్, ఎఇఇ,
జివిఎంసి తాగునీటి సరఫరా విభాగం, భీమిలి జోన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా



సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి -మధురవాడ : పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన, పెండింగ్ మెస్‌ఛార్జిలు, బిల్లులు, మూడునెలల వేతనాలు చెల్లించకుండా వేధింపులకు గురిచేయడం తగదని సిఐటియు నేతలు మండిపడ్డారు. శుక్రవారం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. నాణ్యమైన బియ్యం, గుడ్లు సరఫరా చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం, ఏదోఒకరోజున పొరపాటున అన్నం ముద్దయితే తల్లిదండ్రులు ఫిర్యాదులు చేశారన్న నెపంతో వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. ఇటీవల వాడపాలెం ఉన్నతపాఠశాలలో అన్నం ముద్దయ్యిందని అక్కడి విద్యార్థులు, తల్లిదండ్రులు ఏకంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై వాస్తవాలు అందరికీ తెలియాలంటే సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అక్షయపాత్ర నుంచి వెనక్కు తీసుకుని మునుపటిలా భోజన కార్మికులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పి.రాజకుమార్, పి. మణి, జి. మంగశ్రీ, భోజన కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని బుచ్చిరాజుపాలెం, లక్ష్మీనగర్ యుపిహెచసిలను శుక్రవారం డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. ఆయా ఆరోగ్యకేంద్రాల్లో రోగులకు అందుతున్నసేవలు, మందుల లభ్యత, పలు సర్వేలపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అభ ఐడి మ్యాపింగ్ శతశాతం సాధించాలని, సిబ్బంది సమయపాలన, ఫేషియల్ హాజరు, రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలుఅందించడంపై వైద్యులు, సిబ్బందికి పలుసూచనలు చేశారు. డ్రైడేఫ్రైడేలో పాల్గొన్ని దోమలు నిర్మూలన, పారిశుధ్యం అమలు, డెంగీ, మలేరియా ఇతర సీజనల్ వ్యాధులు రాకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఆర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయకర్త డాక్టర్ హారిక పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



జెసిఎల్‌తో చర్చలు జరుపుతున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి-తగరపువలస: చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులకు పెండింగ్ బకాయిలు చెల్లించేలా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని పలు కార్మిక సంఘాల నేతలు కోరారు శుక్రవారం విశాఖ నగరంలోని కార్మికశాఖ కార్యాలయంలో జాయింట్ లేబర్ కమిషనర్ రామారావుతో చర్చలు జరిపారు. బకాయిలు పెండింగులో ఉండగా ఫ్యాక్టరీ భూములను యాజమాన్యం అమ్ముకోవడం సరికాదని వివరించారు.యాజమాన్యంతో గతంలో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు బకాయిలు చెల్లించి న్యాయం చేయాలని కోరారు. కార్మికసంఘాల ప్రతినిధులు వరహాలరాజు, సిహెచ్ వెంకటరమణ, పడాల రమణ, అల్లు బాబూరావు, కె ఈశ్వరరావు, దల్లి అప్పలరెడ్డి, యాజమాన్య ప్రతినిధులు రామ్‌కుమార్ పాల్గొన్నారు

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - ఆరిలోవ : పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైసిపి జిల్లా కమిటీ యాక్టివ్ సెక్రటరీ, 10వ వార్డు రవీంద్రనగర్‌కు చెందిన పతివాడ కనకరాజు అన్నారు.తనను పార్టీ పదవికి ఎంపిక చేయడంపై ఆనందం వ్యక్తం చేస్తూ, మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, విశాఖ మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు, సీనియర్ నాయకులు మొల్లి అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- యలమంచిలి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటిఎఫ్, పలు ఉద్యోగ, కార్మిక, రైతు, ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి శుక్రవారం యలమంచిలిలో విస్తృత ప్రచారం చేశారు. యలమంచిలి టౌన్‌లో ఉన్న గర్ల్స్ హైస్కూల్, కొత్తపేట హైస్కూల్, స్టేషన్ రోడ్డు, బాయ్స్ హైస్కూల్, గురజాడ అప్పారావు డిగ్రీ కళాశాల తదితర పాఠశాలలు, కళాశాలలకు విజయగౌరి వెళ్లి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇప్పటికే కెజిబివి టీచర్లు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కారం చేయగలిగామని, ప్రస్తుతం ఎంటిఎస్, హెచ్‌ఏ పాలసీ సాధనే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. మోడల్ స్కూల్ టీచర్ల సర్వీసు రూల్స్ అమలు కోసం, కారుణ్య నియామకాల కోసం కృషి చేస్తామన్నారు. కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్, ఎంటిఎస్ విధానంలో పనిచేస్తున్న, గెస్ట్ లెక్చరర్ల సమస్యలపై పిడిఎఫ్ ఫ్రంట్‌గా చిత్త శుద్ధితో పని చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్లకు డివైజఓలుగా పదోన్నతుల ఛానల్‌ను ఓపెన్ చేయడానికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ఇప్పటికే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రభుత్వం ముందు అనేక సార్లు పెట్టారని, వాటి సాధనే లక్ష్యమని పని చేస్తామని చెప్పారు. ప్రాథమిక, ఉన్నత విద్యారంగం, సాంకేతిక వృత్తి విద్యా రంగాల్లో సమస్యల పరిష్కారానికి శక్తి మేరకు కృషి చేస్తానని చెప్పారు. గిరిజన సంక్షేమ గురుకులాల ఔట్ సోర్సింగ్ టీచర్లు, లెక్చరర్ల న్యాయమైన డిమాండ్ల సాధనకు పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జివిఎస్.ప్రకాష్, యల్లయ్య బాబు, రామకృష్ణ, వెంకట్, రాణి, బాలాజీ, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ప్రతినిధిగా విజయగౌరిని గెలిపించండి

ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి -మధురవాడ : ఈ నెల 27న జరగబోయే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీఎన్నికల్లో యుటిఎఫ్, వివిధ ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థికోరెడ్ల విజయ గౌరిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎపి గిరిజన బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల, నవోదయ, జివిపి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ ఓటర్లతో మాట్లాడారు. ఉపాధ్యాయుల పట్ల గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఒకేరకమైన వైఖరిని అవలంభిస్తున్నాయని, సమస్యలను పరిష్కరించకుండా మరింత జటిలం చేస్తున్నాయన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారికి హెల్త్ కార్డులు,ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యావంతుల సమస్యలను పాలక, విపక్షాలు ప్రతినిధులు పట్టించుకోని నేపథ్యంలో వాటిపై ప్రశ్నించే గొంతుకగా శాసనమండలిలో పోరాడుతున్న పిడిఎఫ్ పక్షాన పోటీలో ఉన్న విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటేసి టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో డి.అప్పలరాజు, ఆర్‌కెఎస్‌వి కుమార్, ఆర్ వెంకటరమణ, కె పద్మ, అన్నపూర్ణ, పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మ పాల్గొన్నారు.



వెంకట లక్ష్మిని అభినందిస్తున్న అధ్యాపకులు

వెంకటలక్ష్మికి అభినందనలు

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ సవరాల వెంకటలక్ష్మి చండీఘర్ సెంట్రల్ యూనివర్సిటీల్లో జరిగిన జాతీయ సమైక్యత శిబిరం పూర్తి చేసుకుని కళాశాలకు వచ్చిన సందర్భంగా ఆమెను ప్రిన్సిపల్, అధ్యాపక బృందం శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎపి నుండి పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు క్విజ్ పోటీలు, జానపద నృత్యం, ఇతర అనేక కార్యక్రమంలో బహుమతులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఐవివి సత్యవతి, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ వి.రత్నభారతి, డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ అధ్యాపకులు మల్లిబాబు, జి.వెంకటేష్, కృష్ణారావు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిఇపిడిసిఎల్ ఎస్ఈ ప్రసాద్

పిఎం సూర్య ఘర్‌తో ప్రయోజనం

ప్రజాశక్తి-అనకాపల్లి : సౌర శక్తిని వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ ఎంతో ఆదా అవుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం హోటల్ సన్ క్యాసిల్‌లో పీఎం సూర్య ఘర్‌పై అవగాహన, సమన్వయ సమావేశం జరిగింది. సోలార్ ప్యానెల్స్ వండర్స్, బ్యాంకుల నుండి రుణాలు మంజూరు కోసం డిఆర్డిఏ 10శాతం మార్జిన్ మనీ నిధులు అందజేతపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి, లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె.రాజశేఖర్, నర్సీపట్నం, కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

నేడు ఇ.బోనంగి పోలమాంబ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పరవాడ : జీవిఎంసీ 85 వార్డు పరిధి ఫార్మాసిటీ కాలనీ ఇ.బోనంగిలోని శ్రీపోలమాంబ అమ్మవారి ఆలయ 12వ వార్షికోత్సవం ఈ 15న శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంత్రి గిరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలో శివాలయం పునర్నిర్మాణానికి సబ్బవరం పంచాయతీ శివారు గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు గొర్లి కుమార స్వామి రూ.50,116 విరాళం శుక్రవారం ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బర్ల రమణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, గొంప ముత్యాలనాయుడు, కొల్లి గంగునాయుడు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక శిక్షణ



రంగధామ్‌ను సత్కరిస్తున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

మాదకద్రవ్య నియంత్రణపై నైపుణ్య పెంపు, గంజాయి అక్రమ రవాణా, ఇతర మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోలీసు అధికారులకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక వర్క్‌షాప్ గుండాలు జంక్షన్ జీవీఎంసీ శంకరన్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రిబ్యునల్ అధికారి ఏ.రంగధామ్ మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, దర్యాప్తు చేపట్టాల్సిన విషయాలను వివరించారు. అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నియంత్రణకు చట్టపరమైన కోణాలను అర్థం చేసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. మాదకద్రవ్యాల ప్రభావం వ్యక్తులు, సమాజంపై ఎంత తీవ్రంగా ఉంటుందో పోలీసులు పూర్తిగా తెలుసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చింతపల్లి ఏఎస్పీ నవజ్యోత్ మిశ్రా మాట్లాడుతూ దర్యాప్తు పద్ధతులను మెరుగుపరిచి తీర్పుల శాతం పెంచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ వర్క్‌షాప్‌లో డీఎస్పీలు ఎస్‌బిబి.అప్పారావు, ఎం.శ్రావణి, వి.విష్ణు స్వరూప్, పి.శ్రీనివాసరావు, ఈ.శ్రీనివాసులు, బి.మోహనరావు, ఎంవికె.చైతన్య, ఇన్స్పెక్టర్లు డిసిఆర్‌బి ఎస్.లక్ష్మణమూర్తి, జి.ప్రేమ్ కుమార్, ఎన్‌డిపిఎస్ సెల్ గఫూర్, ఉమ్మడి జిల్లాల నుండి సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

జోరుగా నూకాంబిక ఆలయ నిర్మాణం


ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం కోమలపూడి శివారు బుదిరెడ్డిపాలెంలో నూకాంబిక ఆలయ నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. కొన్నాళ్లుగా అమ్మవారికి దీపధూప నైవేద్యాలు కరువు కావడంతో స్థానిక యువత సొంత నిధులతో ఆలయ పునర్నిర్మాణం చేస్తున్నారు. ప్రస్తుతానికి గోపురం పూర్తయింది. ప్రహరీ, ఇతర పనులు ఉన్నాయి. కొద్ది రోజుల్లోనే ఆలయంలో విగ్రహ ప్రతిష్ట చేస్తామని యువకులు యేన్నంశెట్టి సన్యాసినాయుడు, సత్తిబాబు, సతీష్, గోవింద, శ్రీను, గణేష్, బాలాజీ, ప్రసాదు, సాయి శ్రీకాంత్, చిన్నారి, శేఖర్, రమణ బాబు, సంతోష్ కుమార్, జగదీష్ తెలిపారు.

ఇంటర్, టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఇంటర్మీడియెట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, పరీక్షా పత్రాలకు, తనిఖీ బృందాలకు ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి బి.సుజాత ఇంటర్ పరీక్షలు మార్చి ఒకటి 20వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9 నుండి 12 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. జిల్లాలో 34 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. దేవరాపల్లి, కెడి. పేట పరీక్షా కేంద్రాలలో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 107 పరీక్షా కేంద్రాలలో ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఎపి సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యాన ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 3 నుంచి 15 తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. పదవ తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి జి.రవికుమార్, ఆర్‌టిసి డిపో మేనేజరు కె.పద్మావతి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.ఇంద్రావతి, గ్రామవార్డు సచివాలయ అధికారి బి.నాగలక్ష్మి, పోలీసు, ఎలక్ట్రికల్, ట్రెజరీ, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

నమూనా ప్రాజెక్టుల ప్రదర్శన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో గురు, శుక్రవారాల్లో ఏటీఎల్ ల్యాబ్ లో వర్క్ షాప్ నిర్వహించి తయారు చేసిన నమూనా ప్రాజెక్టులను శుక్రవారం ప్రదర్శించారు. స్మార్ట్ డం మేనేజ్మెంట్, అగ్రిబోట్, హెల్త్ గార్డ్, ఎకాఇంగేజ్ తదితర ప్రాజెక్టులను ప్రిన్సిపల్ జి.గ్రేస్, ఏటీఎల్ ఇంచార్జ్ కె.అపర్ణ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. సమీపంలోని తాళ్లపాలెం జెడ్‌పి హైస్కూల్, గాయత్రి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఈ ప్రాజెక్టులను సందర్శించారు.



నమూనా ప్రాజెక్టుల గురించి వివరిస్తున్న విద్యార్థులు



ఐడిబిఐ డిజిఎంను సత్కరిస్తున్న దృశ్యం

పాఠశాలలకు బీరువాలు వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఐడీబీఐ బ్యాంకు అనకాపల్లి శాఖ సిఎస్ఆర్ నిధులతో జీవీఎంసీ గవరపాలెం చిన్న హైస్కూల్, పెద్ద హైస్కూల్, టౌన్ గర్ల్స్ హైస్కూల్, గంగరాజు చెట్టు వద్ద ఉన్న గర్ల్స్ హైస్కూల్ తదితర పాఠశాలలకు శుక్రవారం బీరువాలు అందజేశారు. సుమారు 1.25 లక్షల విలువగల 6 గోద్రెజ్ బీరువాలను ఐడీబీఐ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కిరణ్ ఫ్రాన్సిస్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా డిజిఎమ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐడిబిఐ బ్యాంక్ సపోర్టింగ్ ఎడ్యుకేషన్ ఫర్ ఎంపవర్ మెంట్ అండ్ డెవలప్ మెంట్(సీడ్) కార్యక్రమాన్ని చేపట్టి దేశవ్యాప్తంగా రూ.30కోట్లతో 2వేల బ్రాంచ్‌ల్లో సిఎస్ఆర్ కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ అనకాపల్లి శాఖ మేనేజర్ డి.గంగాధరరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలో శృంగవరం, ఆర్లి గ్రామాల్లో శుక్రవారం తీర్థాలు జరిగాయి. శృంగవరంలో సింగంపల్లి రాజులమ్మ బాల పేరంటాలు, విజయ పేరంటాలు తీర్థం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం చిడతలు, చిటికలు, భజన్లు నిర్వహించారు. సింగంపల్లి రాములు, కన్నయ్య, సన్యాసిరావు, రామారావు, శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో అన్నదానం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్లిలో శ్రీరాముల వారి తీర్థం సర్పంచ్ బోలెం సందీప్, మాజీ సర్పంచ్ బోలెం అక్కన్న పాత్రుడు, దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

చందక కోటేశ్వరరావు ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్.శివరాంపురం మాజీ సర్పంచ్ కీర్తిశేషులు చందక దేముడు మనవడు, తెలుగుయువత నాయకుడు కీర్తిశేషులు చందక కోటేశ్వరరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ పిల్లలకు పుస్తకాలు, ఉపాధి హామీ కూలీలకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు తల్లితండ్రులు చందక శ్రీనివాసరావు, అప్పియ్యమ్మ, చందక నూకరాజు, టిడిపి నాయకులు నమ్మి రాజు, విఆర్‌పి చందక సత్యారావు, నమ్మి భాస్కరరావు, గడదాసు దుర్గినాయుడు, మొల్లి జగదీష్, మొల్లి సాయిరాం, గోలగాని సాయి, నమ్మి ప్రసాద్, మొల్లి మరునాయుడు, మిరియాల దేవుళ్ళు తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



నివాళులర్పిస్తున్న నేషనల్ లా వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యఅతిథిగా పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన నేర్పిన నైతిక విలువలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి, ఇన్‌ఛార్జి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి, కెఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉపకలెక్టర్ సుబ్బలక్ష్మి, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి బివి.రాణి, పలు వసతి గృహాల సంక్షేమ అధికారులు, సహాయ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో...

జిల్లా ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ సంజీవయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్బిఐ ఇన్స్పెక్టర్ బాల సూర్యారావు, ఎస్సైలు వెంకన్న, విశ్వనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

డిఇఒ కార్యాలయంలో...

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి డిఇఒ గిడ్డి అప్పారావునాయుడు, సహాయ సంచాలకులు రమాజ్యోతి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ పి.అప్పారావు, పర్యవేక్షకులు రామలింగేశ్వరరావు, పార్వతి, ఎపి ఎ.శ్రీధర్ రెడ్డి, ఎఎస్ఓ వెంకటేశ్వరరావు, అచ్యుతరావు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో..

టిడిపి కార్యాలయంలో సంజీవయ్యకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కొణతాల వెంకటరావు, కాండ్రేగుల సత్యనారాయణ, కుప్పిలి జగన్, విల్లూరి రమణబాబు పాల్గొన్నారు.

లా వర్సిటీలో...

సబ్బవరం : మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో వర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, సీనియర్ అధ్యాపకులు ఎ.నాగేశ్వరరావు, డాక్టర్ దయానందమూర్తి సంజీవయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంజీవయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమములో అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్‌లో...

విశాఖ కలెక్టరేట్ : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు ఆదర్శనీయమని, ఆయన జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ కొనియాడారు. శుక్రవారం సంజీవయ్య 104వ జయంతిని పురస్కరించుకొని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంజీవయ్య చిత్రపటానికి కలెక్టర్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు, బిసి సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి, కలెక్టరేట్ ఎఒ. ఈశ్వరరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాంకీ అక్రమంగా తవ్విన చెరువును మూసివేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలో తానాం గ్రామానికి అనుకొని ఒక ప్రైవేట్ స్థలంలో రాంకీ యాజమాన్యం అక్రమంగా తవ్విన చెరువును తక్షణమే మూసివేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం తానాం సచివాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఫార్మా వ్యర్థ రసాయనిక జలాలను ఈ చెరువులో విడిచిపెట్టడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే ఫార్మా కాలుష్యం వల్ల ఇబ్బంది పడుతున్న చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు కాలుష్యం గురించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్విన చెరువు మూసివేయాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఆదేశాలు ఇచ్చి ఉన్నారని తెలిపారు. దీని పక్కనే ఉన్న వర్రివారి చెరువులో రాంకీ యాజమాన్యం అక్రమంగా వ్యర్థాలతో కప్పి వేస్తుందని, ఈ చెరువుకు నేటికీ పరిహారం చెల్లించలేదని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాంకీ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయం సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్రి సన్యాసిరావు, కన్నానాయుడు, వెంకు నాయుడు, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్‌లో సజావుగా క్రషింగ్



మాట్లాడుతున్న ఎమ్‌డి

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో లోపాలు సరిదిద్ది క్రషింగ్ సజావుగా జరుగుతుందని సుగర్స్ ఎమ్‌డి వి.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రారంభ దశలో ఫ్యాక్టరీ బాయిలర్, టరబైన్ వద్ద కొంత అవాంతరాలు రావటం వలన, రైతులకు ఇచ్చిన కటింగ్ ఆర్డర్స్ ప్రకారం చెరకు గానుగాట జరగలేదని, దీంతో రైతులకు కొంత అసౌకర్యం కలిగిందని పేర్కొన్నారు. వెంటనే ఫ్యాక్టరీ మెషినరీ లోపాలు సరిదిద్ది, సిబ్బంది కొరతను అధిగమించి ఇప్పుడు క్రషింగ్ గాడిలోపడే విధంగా చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం రెండు బాయిలర్లను లైన్లోకి తీసుకొని రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయగలుగుతున్నామన్నారు. నైపుణ్యం గల కార్మికులు ఉద్యోగ విరమణ చేసినా, ఉన్న కార్మికులతోనే ఆ నైపుణ్య పని చేయిస్తూ ఫ్యాక్టరీని నడిపిస్తున్నట్లు చెప్పారు. రైతులెవరూ అధైర్యపడకుండా చెరకు నాట్లు, కార్శిల తేదీలను బట్టి కటింగ్ ఆర్డర్ తీసుకొని ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేయాలని కోరారు. రానున్న సీజన్‌లో రైతులు చెరుకు సాగు విరివిగా చేపట్టాలని, అందుకు తగ్గ సహాయ సహకారాలు ఫ్యాక్టరీ అందిస్తుందని తెలిపారు.

పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించి ప్రజలకు భద్రత, రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జివిఎంసి కార్యాలయం మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఓ కార్యాలయంలో ఎఓ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ నూతన జిల్లాగా ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరావు, జిల్లా వికలాంగుల పోరాట సమితి అధ్యక్షులు బుగిడి నూక అప్పారావు, పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని మోసయ్యపేటలో శ్రీమరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం రాత్రి జరిగింది. జనసేన అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ భీమరశెట్టి రాంకీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గొంతిని శ్రీనివాసరావు, నైనముశెట్టి రమణరావు, దొడ్డి నాగేశ్వరరావు, కర్రి సత్యనారాయణ, కొర్ని విజయ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు మరమ్మతులు



సుందరంగా ముస్తాబైన సబ్బవరం బస్ కాంప్లెక్స్

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. సబ్బవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించి 35ఏళ్ళు కావస్తుంది. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ పెచ్చులూడి శిథిలావ్యవస్థకు చేరుకోవడంతో ఆర్టీసీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రయాణికులకు తాగునీరు సదుపాయం, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. కాంప్లెక్స్ భవనానికి మరమ్మతులతో పాటు కొత్తగా రంగులు వేశారు. సబ్బవరం జివిఎంసికి కూతవేటు దూరంలో ఉండడం వల్ల ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ప్రయాణికుల తాకిడి ఎక్కువైంది. విశాఖలోని పలు విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య విపరీతంగా పెరిగింది. మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ మారిటైం యూనివర్సిటీ, పెట్రోలియం యూనివర్సిటీ వంటి జాతీయ విద్యా సంస్థలు మండలంలో ఏర్పాటు కావడంతో విద్యార్థుల రద్దీ అధికమైంది. అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల సంఖ్య పెరగిన నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు కాంప్లెక్స్ మరమ్మతులు చేపటి తాగునీరు ఏర్పాటు చేశారు. కాంప్లెక్స్‌లో రెండు స్టాల్స్ కూడా అందుబాటులో ఉంచారు.

సెప్టిక్ ట్యాంక్‌ను క్లీన్ చేయాలి

సబ్బవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల సెప్టిక్ ట్యాంకును వెంటనే క్లీన్ చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించి సుమారు 35 సంవత్సరాలు కావస్తున్న కాంప్లెక్స్‌లోని మరుగుదొడ్లకు నిర్మించిన సెప్టిక్ ట్యాంక్‌ను ఇంతవరకు ఆర్టీసీ అధికారులు క్లీన్ చేయించలేదు. దీంతో ట్యాంక్ నిండి దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఆర్టీసీ అధికారులు దీనిపై దృష్టి సారించి సెప్టిక్ ట్యాంకు క్లీన్ చేసి ప్రయాణికులకు మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

25లోపు భూ ఆధార్ నమోదు చేయాలి

ప్రజాశక్తి-కశింకోట : భూ ఆధార్ కార్డు నమోదు ఈ నెల 25వ తేదీలోపు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు అన్నారు. మండలంలోని తేగాడ, పేరంటాలపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి స్వప్న, రైతులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

ప్రారంభానికి నోచని ప్రభుత్వ భవనాలు



చౌడువాడలోని హెల్త్ సెంటర్

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఆయా శాఖల సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

చౌడువాడ గ్రామంలో రూ.20 లక్షల తో నిర్మించిన హెల్త్ సెంటర్ ప్రారంభానికి నోచుకోలేదు. అదే విధంగా చిన్న బొడ్డేపల్లి గ్రామంలో 21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రానిది కూడా అదే పరిస్థితి. దాదాపుగా భవనాలు పూర్తికా వచ్చాయి. ప్రారంభం కాకపోవడంతో ఆయా శాఖల సిబ్బంది సచివాలయంలో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

చౌడువాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనంలో విధులు నిర్వహిస్తున్నారు, చిన్నబొడ్డేపల్లి గ్రామంలో కనీసం సచివాలయ భవనం కూడా నిర్మాణం పూర్తికాక పోవడంతో గతంలో ఉన్న చిన్నపాటి పంచాయతీ భవనంలోనే సచివాలయ, రైతు భరోసా, హెల్త్ సెంటర్ల సిబ్బంది అంతా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

అదేవిధంగా రాజుపేట గ్రామంలో రైతు భరోసా కేంద్రం అసంపూర్తిగా దర్శనమిస్తుంది. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



చినబొడ్డేపల్లిలో రైతు భరోసా కేంద్రం



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి

ఫిర్యాదులపై సమీక్ష

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ తహశీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులు, గ్రామ సభలు, రీ సర్వేలో సమయాల్లో అందిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయని తహశీల్దార్ పీ.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా తిరస్కరణకు గురైన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు.



బోరు మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్

బోరు మరమ్మతు పనులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని లింగంపేట గ్రామంలో సర్పంచ్ తోకల సంతోష్ కుమార్ బోరు మరమ్మతు పనులు శుక్రవారం చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ



పంపిణీ చేస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

ప్రజాశక్తి-గొలుగొండ: భారత జవాన్ల సంస్మరణార్థం మండలంలోని ఏఎల్.పురంలో ఫుడ్ ఫర్ పూర్ పీపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు, వికలాంగులకు కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు ఆహార పొట్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ,ఫుడ్ ఫర్ పూర్ పీపుల్ ట్రస్ట్, యువత చేస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఇలాంటి మంచి కార్యక్రమాలు ఎన్నో చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ఫర్ పూర్ పీపుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక మాడవీధుల్లో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఆర్థిక సహాయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం కంపెనీ ప్రతినిధులు, నాయకులు శంకుస్థాపన చేశారు. కంపెనీ సిఎస్ఆర్ నిధుల నుండి సుమారుగా 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 650 మీటర్ల సిమెంట్ రోడ్డు పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు యస్ కుల్లాయి రెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, యన్ రాజారెడ్డి, ఉపమాక వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు, జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి చేతుల మీదుగా రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ, మాడవీధుల్లో రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పాటు స్వామివారి తిరి వీధి వాహన సేవలు, స్వామివారి రథం లాగేటప్పుడు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను హెూం మంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని, ఈ మేరకు ఆమె స్పందించి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడడం జరిగిందన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కంపెనీ యాజమాన్యం ముందుకు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రతినిధి చింతల శ్రీనివాస్, దుర్గమ్మ ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ భర్త కొల్లాటి బుజ్జి, నాయకులు వరహాలరావు, దొరబాబు, తోలేటి శ్రీనివాస్, వాసు, రవి, కనక పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

'మున్సిపాలిటీలో ప్రజాధనం దుర్వినియోగం'


ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ అక్రమాలకు కేరాఫ్‌గా మారిందని జైభీమ్ రావ్ భారత్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు నేతల నాగేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీలో చెత్త ఎత్తి తీసుకువెళ్లే ట్రాక్టర్లు, ఇతర చెత్త వాహనాల డ్రైవర్లుగా పని చేయకుండా డ్రైవర్ల పేరుతో జీతాలు ఇస్తున్నారన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. శానిటేషన్ డ్రైవర్లుగా నియమించడం జరిగిందని, నియమించిన వారిలో ఒకరు లేదా ఇద్దరు మాత్రమే డ్రైవర్లుగా పని చేస్తున్నారన్నారు. మిగతా వారు ఎవరూ కూడా డ్రైవర్లుగా పని చేయరని చెప్పారు. వీరిలో ఎవరికి డ్రైవింగ్ చేయడం రాదని, అయినప్పటికీ నెల నెల క్రమం తప్పకుండా జీతాలు తీసుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. 13 మంది జీఓఎంఎస్ 36 ప్రకారం శానిటేషన్ డ్రైవర్లుగా నియమించగా, వీరిలో ఒక్కరు లేదా ఇద్దరు మాత్రమై డ్రైవర్లుగా పని చేస్తున్నారన్నారు. మిగతా వారు ఎవరూ పని చేయడం లేదన్నారు. ఇప్పటికైనా విచారణ జరిపి మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని లేకుంటే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.



రీ సర్వే చేపడుతున్న సిబ్బంది

చినబొడ్డేపల్లిలో రీ సర్వే

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలోని చినబొడ్డేపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా సమగ్ర రీ సర్వే నిర్వహిస్తున్నట్లు మండల సర్వేయర్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో 2517 ఎకరాలకు గాను ప్రభుత్వ ప్రైవేటు భూములలో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు, రైతుల సమక్షంలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా సర్వే నిర్వహిస్తునమన్నారు, కార్యక్రమంలో పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.



ఆరా తీస్తున్న ఎంపిడిఒ

అభివృద్ధి పనులపై ఆరా

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక ఎంపిడిఒ కార్యాలయాన్ని డిప్యూటీ సీఈఓ కే.రాజకుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగు తున్న అబివృద్ధి పనులపై ఆరా తీశారు. నిధులు ఏ మేరకు ఖర్చు పెట్టారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. జరుగుతున్న పనులు, జరగాల్సిన పనులపై తీరా తీశారు. పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయుల సమావేశం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని వేంపాడు, నక్కపల్లి, చినదొడ్డిగల్లు , గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిధిలో నూతనంగా ఏర్పడిన క్లస్టర్లలో అందరూ ఉపాధ్యాయులతో శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్లైన్ విధానములో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈఓ కే నరేష్ తెలిపారు. ఆన్లైన్ సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని మాట్లాడుతారని తెలిపారు. ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులు అందరూ ఈ సమావేశంలో పాల్గొంటారని తెలియజేశారు. ఆన్లైన్ సమావేశం ఉన్నందున శనివారం మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే పాఠశాలను నిర్వహించడం జరుగుతుందని, మధ్యాహ్నం సెలవు ఉంటుందని వెల్లడించారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలను ఉద్యమాలతో తిప్పికొడతామని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటామని సిఐటియు విశాఖ జిల్లా సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు శుక్రవారమూ కొనసాగాయి. ఈ దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అని, ఈ కర్మాగారం 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిందని గుర్తుచేశారు. దీన్ని ప్రైవేటీకరించాలని చూడటం దారుణమన్నారు. నాలుగేళ్లుగా ఉక్కు పరిరక్షణ పోరాటం కొనసాగుతున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం శోచనీయమన్నారు. కార్మిక, కర్షక, ప్రజా ఉద్యమాలను నేరుగా ఎదుర్కోలేక దొడ్డిదారిన స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ముడి సరుకు అందకుండా చేయడం, బ్లాస్ట్ ఫర్నేస్‌లను నిలిపి వేయడం, కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం.. వంటి చర్యలకు ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం పాల్పడటం తగదన్నారు. ప్రభుత్వ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. దీక్షల్లో ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్, లిటిల్ ఏంజెల్స్ కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగిన 'ఉక్కు' దీక్షలు

ఉక్కునగరం : ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం అన్ని కార్మిక సంఘాలూ ఐక్యం కావాలని ఐఎన్‌టియుసి నాయకులు మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1464వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారని, ఇప్పుడు విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి ఎంతటి త్యాగాలకైనా మరలా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. మోడీ సర్కారు తీరుతో ప్రభుత్వరంగ సంస్థల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

రావణాపల్లి రిజర్వాయర్‌కు ముప్పు

- ఇనుప కంచెతో పెరిగిన పూడిక - తొలగించాలని స్పీకర్ అయ్యన్న ఆదేశించినా అమలు కాని వైనం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ, నర్సీపట్నం మండలాల్లో 2,668 ఎకరాలకు సాగునీరందిస్తున్న రావణాపల్లి రిజర్వాయర్‌కు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ముప్పు తప్పేట్లు లేదు. రిజర్వాయర్ గర్భంలో కొంత మంది ప్రైవేటు వ్యాపారులు మత్స్యకార సొసైటీ పాలకవర్గం కలసి ఇరిగేషన్ అధికారులు అనుమతి లేకపోయినా గత ఏడాది ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. దీని ఏర్పాటుకు గత ప్రభుత్వంలో ఉన్న ప్రజా ప్రతినిధులు ఒత్తిళ్ల మేరకు ఇరిగేషన్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించారు. దీంతో రిజర్వాయర్



పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్న (ఫైల్ ఫొటో)

గర్భంలో పూడిక పెరిగి ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు రిజర్వాయర్లో నీటి నిలువలు పెరిగి అప్పట్లో గండి ఏర్పడింది. స్థానికులు గండి ఏర్పడ్డ వెంటనే గుర్తించి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయడంతో రిజర్వాయర్‌కు పెను ప్రమాదం తప్పింది. పలువురు రైతులకు సాగునీరు అందించే రిజర్వాయర్ గర్భంలో ఇనుప కంచె వంటి కట్టడాలు ఏర్పాటు చేస్తుంటే ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారు మినహా ఎటువంటి చర్యలు చేపట్లేదు. రిజర్వాయర్ గర్భంలో ట్రాక్టర్ ఇసుక లేదా మట్టిని తీసుకువెళ్తేనే నానా హడావిడి చేసి కేసులు పెట్టే ఇరిగేషన్ అధికారులు గత ఏడాది రిజర్వాయర్ గర్భంలో ఇనుపకంచె ఏర్పాటు చేస్తుంటే స్పందించక పోవడం విడ్డూరంగా ఉంది. గండిపడ్డ ప్రాంతాన్ని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెంటనే ఇనుపంచి తొలగించాలని అధికారులను ఆదేశించారు. నీరు తగ్గిన వెంటనే చర్యలు చేపడతామని చెప్పిన అధికారులు ప్రస్తుతం ఇనుప కంచ ఏర్పాటు చేసిన ప్రదేశంలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ ఆయన ఆదేశాలను అమలు చేయలేదు. రిజర్వాయర్ గర్భంలో ఎటువంటి కట్టడాలు ఏర్పాటు చేయకూడదనేది అందరికీ తెలిసిన విషయమే. మత్స్యకారులకు ఉపయోగ పడుతుందనే సాకుతో వ్యాపారులు లాభం కోసం గత



పేరుకుపోయిన పూడిక

ప్రభుత్వంలోని ప్రజాప్రతినితో కలిసి ఈ కంచె ఏర్పాటుకు తెరలేపారు. గత ఏడాది ఇనుప కంచె ఏర్పాటు నిమిత్తం ప్రైవేట్ వ్యాపారులు ఇరిగేషన్ అధికారులకు, కొంతమంది ప్రజాప్రతినిధులకు కొంత సొమ్ము ముట్ట చెప్పారనే విషయం అప్పట్లో ప్రచారంలోకి వచ్చింది.

ఏఈ రామన్నపాత్రుడు దృష్టికి ఈ విషయాన్నీ తీసుకెళ్లగా శివరాత్రి కి రిజర్వాయర్ నుండి నీరు విడుదల చేస్తామని, ఆ సమయంలో గేటు రిపేరు చేయించడంతో పాటుగా ఇనుపకంచును తొలగిస్తామని తెలిపారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఘనంగా భీమాబాయి జయంతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మండలంలోని చెట్టుపల్లి ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ తల్లి బీమాబాయి జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా భీమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు మాట్లాడుతూ, అంబేద్కర్‌కి తోడుగా నీడగా ఉంటూ త్యాగశీలిగా నిలిచిన మహాతల్లి బీమా బాయి అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్‌వైజర్ రాజేశ్వరి, టీచర్ లక్ష్మి, ఆయా శివలక్ష్మి, కాపు సంఘం అధ్యక్షులు ఇన్నం రమణ, ట్రేడ్ యూనియన్ నాయకులు మోపాడ సత్యప్రసాద్, భవన నిర్మాణ అధ్యక్షులు పసుపులేటి అప్పలనాయుడు, దళిత నాయకులు రావాడ అచ్చిబాబు, కొవ్వూరు ఎర్రంశెట్టి స్వామి, పండూరి బాబురావు, సత్తిబాబు, డైరెక్టర్ బంటు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విశ్రాంత కెప్టెన్

ఘనంగా పెన్ స్కూల్ క్రీడోత్సవం

ప్రజాశక్తి- సీతమ్మధార : విద్యార్థులకు క్రీడలు మానసికంగా శారీరకంగా ఎంతో ఉపయోగపడతాయని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విశ్రాంత కెప్టెన్ జెవి సునీల్ కుమార్ తెలిపారు శుక్రవారం పోర్ట్ స్టేడియంలో పెన్ ఒలింపిక్స్, పెన్ స్కూల్ వార్షిక క్రీడోత్సవాలను క్రీడాజ్యోతి ప్రజ్వళనతో ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, షాట్‌పుట్, అథ్లెటిక్స్ సహా 25 ఈవెంట్లలో పోటీలు నిర్వహించగా, వెయ్యిమందికి పైగా మంది విద్యార్థులు పాల్గొని తమ క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించారు. వేడుకలో ఎన్‌సిసి మార్చ్‌ఫాస్ట్, సామూహిక డ్రిల్ అలరించింది. పెన్ స్కూల్ ఛైర్మన్ అనితా పెరీరా మాట్లాడుతూ 42ఏళ్ల చరిత్ర కలిగిన పెన్‌స్కూల్ విద్యార్థులను క్రమశిక్షణతోకూడిన నాణ్యమైన విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రోత్సాహంతో కృషి చేస్తోందన్నారు. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు..

పారదర్శకంగా పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 34 కేటగిరీలలో ఖాళీగా ఉన్న 244 పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. పోస్టులు అమ్ముకుంటున్నారన్న వదంతులు తన దృష్టికి వచ్చిందని, అటువంటి వదంతులు ఎవ్వరూ నమ్మవద్దన్నారు. ఎవరూ ఎవరికీ డబ్బులు ఇచ్చి మోస పోవద్దని సూచించారు. ప్రభుత్వ నిభంధనల ప్రకారం నోటిఫై చేసిన పోస్టులను రోస్టర్ అనుసరించి మాత్రమె ఖాళీలు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. నియామకం, దృవపత్రాల పరిశీలనకు ఒక నోడల్ అధికారి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్ధుల మార్క్స్ లిస్టులు, అనుభవం తదితర అంశాల ఆధారంగా మెరిట్ లిస్టు ప్రకటించడం జరుగుతుందని, మెరిట్ లిస్టు ప్రకారమే తుది జాబితా ప్రకటించి భర్తీ చెయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. వదంతులను, రూమర్లను నమ్మవద్దని, ఎవరైనా డబ్బులు అడిగినట్లు తెలిస్తే కళాశాల ప్రిన్సిపాల్ కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

- కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు తగిన జాగ్రత్తలు వహించాలని, పటిష్టమైన పరిరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు.ప్రజల నుంచి వచ్చే వినతులకు సకాలంలో సమాధానం చెప్పాలని, సమస్యలను నిర్ణీత గడువులో పరిస్కరించాలని సూచించారు. సులభతర రీతిలో, స్నేహపూర్వక వాతావరణంలో రెవెన్యూ సేవలను అందించాలని హితవు పలికారు. కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం జరిగిన విశాఖ డివిజన్ రెవెన్యూ కాన్ఫరెన్స్ లో ఫ్రీహోల్డ్, భూముల క్రమబద్ధీకరణ, ఆక్రమణల తొలగింపు, ఎన్‌ఒసి పత్రాల జారీ, సర్వే, మ్యుటేషన్ ప్రక్రియ, 22 ఎ డీనోటిఫికేషన్ వంటి వాటిపై చర్చించి అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక వాతావరణంలో సేవలను అందించాలని సూచించారు. ప్రజలు పెట్టుకునే అర్జీలను తిరస్కరించినట్లయితే అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.కాలయాపన చేయకుండా పనులు చేయాలని చెప్పారు.భూముల క్రమబద్ధీకరణ విషయంపై ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించాలని సూచించారు.కోర్టు కేసుల విషయంలో త్వరితగతిన స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు,కాలువల అన్యాక్రాంతాన్ని గుర్తించి తగిన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ఆదేశించారు. సర్వే, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, మజిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్, విశాఖపట్టణం ఆర్డీవో పి.శ్రీలేఖ పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన వెంటనే

జనన ధ్రువీకరణ పత్రాలు అందజేయండి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:బిడ్డ పుట్టిన వెంటనే సంభందిత ధ్రువీకరణ పత్రాల్లో ఎటువంటి తప్పులు లేకుండా నేరుగా తల్లిదండ్రులకు అప్పగించేలా కెజిహెచ్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి, గొండు సీతారాం, ఆదిలక్ష్మి త్రిపర్ణలు ఆదేశాలు జారీ చేశారు. విశాఖ జిల్లా పర్యటనలో ఉన్న వీరు శుక్రవారం కెజిహెచ్ ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ డి.రాధాక్రిష్ణ సారధ్యంలో సెంచినరీ హాలులో జరిగిన సమావేశంలో పిల్లల జన్మ,మరణ దినోత్సవ ధ్రువీకరణ పత్రాల్లో సత్వర తప్పొప్పులు సవరణలపై చర్చించారు. ఈ చర్చలో కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, పిల్లల జనన,మరణ సర్టిఫికెట్లు అందించేందుకు పిల్లల వార్డుకు అనుసంధానంగా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు, 2024 జనవరి నుండి డిసెంబర్ వరకు ఎంతమంది పిల్లలు జన్మించారు, ఎంతమంది మరణించారు, ఈ కాలానికి ఎంత మందికి ఈ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు? పెండింగ్‌లో ఉన్నవి, అక్షర దోషాలు మార్పులు చేర్పులు చేయాల్సినవి వంటివాటిని వైద్యాధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. పిల్లల వార్డు ప్రాంగణంలోనే డిఎస్‌ఓ,ఎఎస్‌ఓ లో సారధ్యంలో జనన,మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. ఆసుపత్రి ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ డి.రాధాకృష్ణ మాట్లాడుతూ ఆసుపత్రిలో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సిఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ మెహర్, చిన్నపిల్లల వైద్య విభాగం అధిపతి బి.చక్రవర్తి, జివిహెచ్ సూపరింటెండెంట్ ఉషా ప్రసాద్, ఆర్‌ఎంఓ ధవళ భాస్కర రావు, ఐసిడిఎస్ ప్రోజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి,అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎస్.గోవిందరావు,చైల్డ్ డెవలప్మెంట్ ప్రోజెక్ట్ ఆఫీసర్ రమణ కుమారి పాల్గొన్నారు.



మాట్లాడతున్న కమిషన్ సభ్యులు